


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348


# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| ఆదివారం 01 మార్చి 2026 | పేజీలు 04 | వెల రూ: 2/- | సంపుటి 01 ,సంచిక 272 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత |
|---|---|---|---|---|---|

## జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు



సర్ సి.వి. రామన్,21 నవంబర్ 1970, బెంగళూరు లో మరణించారు.ఆయన చివరి వరకు పరిశోధనలు చేస్తూనే ఉన్నారు.ఆయన గౌరవార్థం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28 ,జాతీయ సైన్స్ దినోత్సవం, రామన్ ప్రభావం కనుగొన్న రోజు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 1: దేశానికి గర్వకారణంగా నిలిచిన ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ గారి పరిశోధనలు, ఆవిష్కరణలకు గుర్తింపుగా జరుపుకుంటున్న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శాస్త్రవేత్తలు, నిపుణులు, యువతీ యువకులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుభాభినందనలు తెలిపారు. రామన్ గారి స్ఫూర్తిగా యువత విజ్ఞానం, సృజనాత్మకత, ఆలోచనా శక్తికి పదునుపెట్టి సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణల దిశగా అడుగులు వేస్తూ దేశాభివృద్ధికి మార్గదర్శకం కావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కొత్తగా ఆలోచించాలని, భిన్నంగా ఆవిష్కరించాలని, సృజనాత్మకతే రేపటి భారతదేశాన్ని నిర్మిస్తుందని పేర్కొంటూ, మీ ప్రయత్నం ఎప్పటికీ వృథా కాదని, సాంకేతికతను సమాజానికి మేలు చేసే దిశగా వినియోగించాలని సూచించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో మహిళలు మరింతగా పురోగమించాలని కూడా ముఖ్యమంత్రి తన సందేశంలో పిలుపునిచ్చారు.



## నియోపోలిస్‌లో జలమండలికి 3.95 ఎకరాల భూమి కేటాయింపు గ్రావిటీ ద్వారా నగరానికి తాగునీటి సరఫరా సౌకర్యం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 1: హైదరాబాద్ నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభా మరియు ఔటర్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న వెర్టికల్ అర్బనైజేషన్ నేపథ్యంలో తాగునీటి అవసరాలు అధికంగా పెరుగుతున్నాయి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం గోదావరి తాగునీటి సరఫరా ప్రాజెక్ట్ ఫేజ్–2, ఫేజ్–3తో పాటు మూసీ నది పునరుజ్జీవానికి ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను గోదావరి జలాలతో నింపేందుకు అదనంగా 300 ఎంజీడీ నీటిని తరలించే ప్రణాళికను అమలు చేస్తోంది. నియోపోలిస్–కోకాపేట్ ప్రాంతంలో సంప్, పంప్ హౌస్, సెక్షన్ ఆఫీస్, జీఎల్ఎస్ఆర్, ఎస్టీపి నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ఖానాపూర్ వద్ద జలమండలికి ఉన్న 8.75 ఎకరాల భూమి సరిపోకపోవడంతో అదనంగా HMDA గుర్తించిన 3.95 ఎకరాల భూమిని ప్రభుత్వం జలమండలికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భూభాగం సుమారు +592 మీటర్ల ఎత్తులో ఉండటంతో గ్రావిటీ విధానంలోనే నీటిని సరఫరా చేసే వీలుండటంతో పంపింగ్ ఖర్చులు తగ్గనున్నాయి. ఈ రిజర్వాయర్ ద్వారా నియోపోలిస్, కోకాపేట్ మాత్రమే కాకుండా బోజగుట్ట రిజర్వాయర్, ఓల్డ్ సిటీ, షేక్‌పేట, రెడ్ హిల్స్, మెహదీపట్నం ప్రాంతాలకు కూడా గ్రావిటీ ద్వారా మంచినీటి సరఫరా చేయడం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

## మదీనా ప్రమాద బాధిత కుటుంబాలకు పరిహారం చెక్కులు – మీకు ప్రభుత్వం అండగా ఉంటుంది: సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 1: మదీనా బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రమాద బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడిన సీఎం, ప్రమాదం జరిగిన వెంటనే మంత్రి అజారుద్దీన్ నేతృత్వంలో ప్రతినిధి బృందాన్ని మదీనాకు పంపించినట్లు తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులకు తక్షణమే పాస్‌పోర్టులు, వీసాలు ఇప్పించి మదీనాకు పంపించామని, భారత కాన్సులేట్ మరియు సౌదీ ప్రభుత్వంతో చర్చించి మృతుల అంత్యక్రియలు జరిపినట్లు చెప్పారు. సాధారణంగా విదేశాల్లో జరిగే ప్రమాదాలకు ప్రభుత్వాలు పరిహారం చెల్లించవని, కానీ మానవతా దృక్పథంతో సహాయం చేయాలని నిర్ణయించి మృతుల 44 కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల చొప్పున, తీవ్రంగా గాయపడిన ఒకరికి మూడు లక్షల రూపాయల పరిహారం చెక్కులు అందజేసినట్లు తెలిపారు. చెక్కులను ఇళ్లకు పంపించవచ్చని, కానీ బాధిత కుటుంబాలను కలుసుకుని ప్రభుత్వం అండగా ఉందని తెలియజేయాలనే ఉద్దేశంతో సచివాలయానికి పిలిపించినట్లు చెప్పారు. ముస్లిం సోదరులతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, 2009 నుండి కొడంగల్ నియోజకవర్గంలోని ప్రతి మండలం నుంచి ప్రతి సంవత్సరం ఒక్కొక్కరిని తన ఖర్చులతో హజ్ యాత్రకు పంపిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, సీఎం సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా, టీజీఎంఆర్ఈఐఎస్ వైస్ చైర్మన్ ఫహీం ఖురేషి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## మదీనా ప్రమాద మృతుల కుటుంబాలకు పరిహారం చెక్కులు అందించిన సీఎం రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 1: సౌదీ అరేబియాలోని మదీనా సమీపంలో నవంబర్ 17, 2025న జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో సజీవదహనమైన 44 మంది హైదరాబాద్ వాసుల కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెక్రటేరియట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఐదు లక్షల రూపాయల చొప్పున పరిహారం చెక్కులు అందజేశారు. ప్రమాదంలో గాయపడిన ఒకరికి మూడు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సహాయక చర్యలు చేపట్టామని, మంత్రి అజారుద్దీన్‌ను మదీనా పంపినట్లు తెలిపారు. సాధారణంగా దేశం వెలుపల జరిగిన ప్రమాదాలకు ప్రభుత్వాలు పరిహారం చెల్లించవని, అయితే బాధిత కుటుంబాల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుని సహాయం ప్రకటించామని చెప్పారు. నాంపల్లి అగ్ని ప్రమాదంలో మృతుల కుటుంబాలను కూడా ప్రభుత్వం ఆదుకున్నదని గుర్తుచేశారు. ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందనే నమ్మకం కల్పించడం ముఖ్యమని, అందుకే కుటుంబాలను సెక్రటేరియట్‌కు పిలిచి పరిహారం అందించామని తెలిపారు. ఇది మీ ప్రభుత్వం, మీ కష్టం ఆనందంలో మీతోనే ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబీర్ అలీ, సీఎం సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డి, సీఎంఓ ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, నాంపల్లి ఎమ్మెల్యే మహమ్మద్ మాజిద్ హుస్సేన్, హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రో పాషా, టీజీఎంఆర్ఈఐఎస్ వైస్ చైర్మన్ ఫహీమ్ ఖురేషి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఒబేదుల్లా కొత్వాల్ పాల్గొన్నారు.



## భూదాన్ భూముల వ్యవహారంలో సంయమనం పాటించాలి – అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సందేశం టైమ్స్, ఖమ్మం, మార్చి 1: భూదాన్ భూముల వ్యవహారంపై జరుగుతున్న ప్రచారాలకు కార్యకర్తలు ఆవేశానికి లోనుకాకుండా సంయమనం పాటించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పత్రికా ప్రకటనలో కోరారు. ఈ విషయంపై దుష్ప్రచారం చేస్తున్న కొందరు రాజకీయ ప్రేరేపిత వ్యక్తులు, సోషల్ మీడియా వ్యక్తులపై వెంటనే కేసులు పెట్టాల్సిన అవసరం లేదని, వాస్తవాలు బయటపడిన తర్వాత ప్రభుత్వ చర్యల సరైనత ప్రజలకు అర్థమవుతుందని తెలిపారు. భూదాన్ భూముల్లో అర్హులైన ప్రతి పేదవారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. పేదల సంఘం ముసుగులో విలువైన ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించి పేదలను అడ్డు పెట్టుకుని డబ్బులు వసూలు చేసిన ఘటనలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని, అదే సమయంలో నిజమైన పేదల పట్ల మానవీయ దృక్పథంతో ముందుకు సాగుతుందని చెప్పారు. వెలుగుమట్ల భూదాన్ భూముల్లో కనీస సదుపాయాలు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని, కరెంట్, నీరు, డ్రైనేజీ, రోడ్లు లేని పరిస్థితి ఏర్పడటానికి అక్రమ ఆక్రమణలే కారణమని తెలిపారు. అర్హులైన పేదలను గుర్తించేందుకు జిల్లా కలెక్టర్‌కు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు, గుర్తింపు పూర్తయ్యాగానే వారికి ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వ భూమి సిద్ధం చేయాలని సూచించినట్లు వెల్లడించారు. గత నాలుగు దశాబ్దాలుగా పేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేశానని, ఖమ్మం నగరంలో వేలాది పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చిన అనుభవంతోనే వెలుగుమట్ల బాధితులకు కూడా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. భూదాన్ భూముల అక్రమాలపై ప్రభుత్వం విచారణ కొనసాగుతుందని, విచారణ పూర్తయ్యే వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహనం పాటించాలని, సోషల్ మీడియా వార్తలపై పోలీస్ ఫిర్యాదులు చేయవద్దని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు.

## పామాయిల్ రైతులకు శుభవార్త – టన్నుకు రూ.21546 ధర, 15024 మంది రైతులకు అదనపు లాభం: మంత్రి తుమ్మల




సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 1: రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం పామాయిల్ గెలల ధర టన్నుకు రూ.21546కు చేరడంతో 15024 మంది రైతులకు సుమారు రెండు కోట్ల రూపాయల మేర అదనపు లబ్ధి చేకూరనుందని చెప్పారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన సమయంలో టన్నుకు రూ.12534 మాత్రమే ఉన్న ధర ప్రస్తుతం గణనీయంగా పెరిగిందని, పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకుని రైతులు ఆయిల్ పామ్ సాగు వైపు ముందుకు రావాలని సూచించారు. ఆయిల్ ఫెడ్ నిర్వహిస్తున్న అప్పారావుపేట, అశ్వరావుపేట ప్రాసెసింగ్ మిల్లుల్లో ఆధునిక యంత్రాలు ఏర్పాటు చేయడంతో నూనె రికవరీ శాతం 20.01కు పెరిగిందని, దీనివల్ల గెలల ధర పెరిగి రైతులకు లాభం కలుగుతోందని తెలిపారు. తెలంగాణలో నిర్ణయించిన ధరలను ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయాల్సి రావడంతో అక్కడి రైతులకు కూడా ప్రయోజనం కలుగుతోందన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 2.90 లక్షల ఎకరాల్లో 79,113 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాతే 1,07,400 ఎకరాల్లో 33,500 మంది రైతులు సాగు ప్రారంభించారని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆయిల్ పామ్ సాగు కోసం రూ.456 కోట్లు కేటాయించామని, వచ్చే సంవత్సరంలో మరో రెండు లక్షల ఎకరాల్లో సాగు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుతం 68,600 ఎకరాల నుంచి ఉత్పత్తి వస్తోందని, రైతులను ప్రోత్సహించేందుకు ఏకరానికి రూ.50,918 రాయితీని నాలుగేళ్లపాటు ఇస్తున్నామని, దీర్ఘకాలిక లాభాలను దృష్టిలో పెట్టుకుని రైతులు పెద్ద ఎత్తున ఆయిల్ పామ్ సాగు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.

## శారద పీఠం భూములు పీఠానికే కొనసాగింపు జలమండలి కేటాయింపులు రద్దు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 1: కోకాపేటలో శారద పీఠానికి కేటాయించిన భూములను పీఠానికే కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. శారద పీఠం భూములను జలమండలికి కేటాయించిన నేపథ్యంలో అక్కడ జరుగుతున్న నిర్మాణాల విషయాన్ని పీఠం ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, శనివారం సాయంత్రం రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. కోకాపేట భూముల్లో పీఠం ఆధ్వర్యంలో జరుగుతున్న నిర్మాణాల తాజా స్థితిపై వివరాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి, భూములను జలమండలికి కేటాయించే సమయంలో నిర్మాణాల పరిస్థితి తెలియజేయకపోవడంపై అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జలమండలికి చేసిన కేటాయింపులను రద్దు చేసి భూములను శారద పీఠానికే కొనసాగించాలని ఆదేశించారు. అలాగే నిర్మాణాల స్థితి, ఇతర పరిస్థితులపై పూర్తి వివరాలతో మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వివరించాలని ముఖ్యమంత్రి పీఠం ప్రతినిధులకు సూచించారు.

# ఇంటర్ పరీక్షల కోసం 30 కేంద్రాల్లో ప్రథమ చికిత్స కేంద్రాలు – జిల్లా వైద్యాధికారి డా. పెండెం వెంకటరమణ



తెలంగాణ | సూర్యాపేట

సూర్యాపేట సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 1: సూర్యాపేట జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఉన్న 30 పరీక్షా కేంద్రాలలో ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. పెండెం వెంకటరమణ తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సరైన భోజనం చేయడంతో పాటు తగినంత నిద్ర తీసుకోవాలని, ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో శిక్షణ పొందిన పారామెడికల్ సిబ్బందిని నియమించి అవసరమైన ఔషధాలతో ప్రథమ చికిత్స సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలను సంబంధిత వైద్యాధికారులకు అప్పగించామని, విద్యార్థులకు ఎప్పటికప్పుడు అవసరమైన ఆరోగ్య సేవలు అందించేందుకు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ పూర్తిగా సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు.



# అర్హులైన పేదలకు ఇండ్ల స్థలం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పొంగులేటి హామీ హర్షం ప్రకటించిన లింగాల రవికుమార్

ఖమ్మం, ఫిబ్రవరి 28 :- ఖమ్మం జిల్లా వెలుగుమట్ల సమీపంలో భూధాన్ బోర్డు భూముల్లో నిరాశ్రయులైన అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించడం పట్ల బిఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షులు దళిత బహుజన సామాజిక ఉద్యమ నేత లింగాల రవికుమార్ హర్షం ప్రకటించారు.మంత్రి పొంగులేటి పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని, మంత్రి ఆధ్వర్యంలో గ్రామీణ పట్టణ ప్రాంతాలలో నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నారని లింగాల రవికుమార్ పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం భూదాన్ బోర్డు భూములలో దళారుల చేతిలో మోసపోయి ఆర్థికంగా నష్టపోయిన బాధితులకు పోలీస్ అధికారుల సహకారంతో డబ్బులు ఇప్పించేందుకు కృషి చేయాలని రవికుమార్ విజ్ఞప్తి చేశారు పునరావాస కేంద్రాలలో ఇబ్బంది పడుతున్న భూధాన్ బాధితులకు అత్యంత వేగవంతంగా ఇండ్ల స్థలాలు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వానికి సంబంధిత అధికారులకు లింగాల రవికుమార్ విజ్ఞప్తి చేశారు.

# జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జోగిపేట




సందేశం టైమ్స్ జోగిపేట మార్చి 1 ( టి సంగమేశ్వర్ ప్రతినిధి ) సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండల్ లోని స్థానిక నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రమేష్ ఆదేశాల మేరకు భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు వివిధ రకాల విజ్ఞాన నమూనాలను (సైన్స్ మోడల్స్) రూపొందించి వాటి ప్రత్యేకతలను వివరించారు.అదేవిధంగా విజ్ఞాన దినోత్సవ ప్రాధాన్యంపై ఉపన్యాసాలు నిర్వహించారు.వాణిజ్య విభాగ అధ్యాపకులు డాక్టర్ జి. పండరి మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రం జ్ఞానాన్ని అభివృద్ధి చేసే నిరంతర ప్రక్రియ అని, ఇది విద్యార్థుల్లో ప్రయోగాత్మక నైపుణ్యాలను పెంపొందిస్తుందని తెలిపారు. అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్. శ్రీకాంత్ మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రం మానవ జీవితాన్ని సులభతరం, వేగవంతం, సౌకర్యవంతంగా మార్చడంలో కీలక పాత్ర పోషించిందని చెప్పారు. రవాణా, కమ్యూనికేషన్, వ్యవసాయం, సాంకేతిక రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందని వివరించారు.వృక్ష శాస్త్ర విభాగ అధ్యాపకురాలు ఆర్. స్వర్ణలత సైన్స్ ద్వారా ప్రయోగాలు, పరిశీలనలు, విశ్లేషణల ద్వారా విద్యార్థుల జ్ఞానం విస్తరిస్తుందని సూచించారు. భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు టి. రేష్మా దేవి మాట్లాడుతూ 'సైన్స్' అనే పదం లాటిన్ భాషలోని 'సైన్షియా' (Scientia) అనే పదం నుండి ఉద్భవించిందని, దాని అర్థం 'తెలుసుకోవడం' అని వివరించారు. విజ్ఞాన శాస్త్రం ఎప్పటికప్పుడు స్వీయ మూల్యాంకనం చేసుకుంటూ అభివృద్ధి చెందుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ విభాగ అధ్యాపకురాలు ఎం. సంధ్యాతో పాటు ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఉపాధి హామీ పనులపై కేంద్ర బృందం పరిశీలన – కలెక్టర్‌కు నివేదిక సమర్పణ

సూర్యాపేట సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 1: సూర్యాపేట జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ నుండి వచ్చిన కేంద్ర బృందం ఫిబ్రవరి 26 నుండి 28 వరకు జిల్లాలో పర్యటించింది. ఫిబ్రవరి 26న తుంగతుర్తి మండలం తుంగతుర్తి, గొట్టిపర్తి గ్రామపంచాయతీలలో ఉపాధి హామీ పనులు మరియు రికార్డులను పరిశీలించగా, ఫిబ్రవరి 27న నూతనకల్ మండలం దర్శించర్ల, సోమ్లా తండా గ్రామపంచాయతీలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం శనివారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో కేంద్ర కమిటీ సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌కు పర్యటన వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కేంద్ర బృంద సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దిల్‌కుష్ మీనా, సంజయ్ పాండే, జాగృతి రాయ్ పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి ఈ ప్రకటన విడుదల చేశారు.



# ఖేడ్ మున్సిపల్ లో పలు వార్డుల్లో పర్యటించిన చైర్మన్ నాగేష్ శెట్కార్

సందేశం టైమ్స్ మార్చి 1(టీ సంగమేశ్వర్ )సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలో పలు వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్ గారు విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో మున్సిపల్ ప్లానింగ్ ఆఫీసర్ గారు, 2వ వార్డ్ కౌన్సిలర్ సురేఖ గారు, 5వ వార్డ్ కౌన్సిలర్ మహేష్ గారు, 9వ వార్డ్ కౌన్సిలర్ బాణపురం రాజు గారు, 13వ వార్డ్ కౌన్సిలర్ వివేకానంద మహేందర్,మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు చామకురా పాండు గార్లు పాల్గొన్నారు.ప్రతి వార్డ్‌లో రోడ్ల దుస్థితి, మురికి కాలువల సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థ లోపాలు వంటి అంశాలను పరిశీలించారు. ప్రజల నుంచి సమస్యలను స్వయంగా విని, వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని చైర్మన్ నాగేష్ శెట్కార్ గారు స్పష్టమైన సూచనలు చేశారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడం మున్సిపాలిటీ ప్రాధాన్య లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# పదవి విరమణ పొందిన ఎస్ఐ ధశరత్, ఏఎస్ఐ యాదగిరి ఘన సత్కారం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్




సందేశం టైమ్స్ సంగారెడ్డి, మార్చి 1( టీ సంగమేశ్వర్ ప్రతినిధి,) సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ రోజు పదవి విరమణ పొందిన ఎస్ఐ ధశరత్, ఏఎస్ఐ యాదగిరి లకు ఘనంగా సత్కారం నిర్వహించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో పదవి విరమణ సహజమని, అయితే శాఖకు నిబద్ధతతో చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. 1983లో కానిస్టేబుల్‌గా చేరిన ధశరత్ నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ధైర్యసాహసాలతో విధులు నిర్వర్తించి ఎలాంటి రిమార్క్ లేకుండా అంచెలంచెలుగా ఎదిగి సబ్-ఇన్స్పెక్టర్ హోదాకు చేరడం ప్రశంసనీయమని తెలిపారు. ఇంద్రకర్, మునిపల్లి, వట్‌పల్లి, నాగల్‌గిద్ద స్టేషన్లలో ఎస్హెచ్ఓగా సమర్థవంతంగా పనిచేసి అధికారుల మన్ననలు పొందారని అన్నారు. 1992లో కానిస్టేబుల్‌గా చేరిన యాదగిరి ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ స్టేషన్లలో క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ పదోన్నతులు పొంది అసిస్టెంట్ సబ్-ఇన్స్పెక్టర్‌గా ఎదగడం వారి ప్రతిభకు నిదర్శనమని కొనియాడారు. రిటైర్మెంట్ అనంతరం వారికి అందాల్సిన అన్ని ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన ఎస్పీ, ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీనివాస్ రావు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఈ. కళ్యాణి, ఎఆర్ డియస్పీ నరేందర్, ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.






## ప్రతి ఫిర్యాదు ఆన్లైన్‌లో నమోదు చేయాలి - లాంగ్ పెండింగ్ కేసులకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్

### మంత్లీ క్రైమ్ రివ్యూలో ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాలు

సందేశం టైమ్స్ సంగారెడ్డి, మార్చి 1( టి సంగమేశ్వర్ ప్రతినిధి )సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారి నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ అధికారులు ప్రతి ఫిర్యాదును ఆన్లైన్‌లో నమోదు చేసి ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలని ఆదేశించారు. అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్, మిస్సింగ్, ఎబ్‌బిడబ్ల్యూ కేసులపై సమీక్ష నిర్వహించిన ఆయన, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ అమలు చేయాలని, అవసరమైతే ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఎస్‌హెచ్ఓలు తమ పరిధిలోని గ్రామాలను సందర్శించి స్థానిక సమస్యలను తెలుసుకోవడంతో పాటు మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్లైన్ మోసాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రౌడీ షీటర్లు, అనుమానితుల కదలికలపై నిఘా పెంచి, బ్లూకోల్ట్స్, నైట్ పట్రోలింగ్ సిబ్బంది పాపిలోన్ పరికరాలతో ఫింగర్ ప్రింట్లు సేకరించాలని సూచించారు. సీసీ కెమెరాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించి దేవాలయాలు, పరిశ్రమలు, ధాబాలు, పెట్రోల్ బంకులు వంటి ముఖ్య ప్రదేశాల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేసిన ఎస్పీ, వాహనాల రెగ్యులర్ సర్వీసింగ్‌పై కూడా దృష్టి సారించాలని డ్రైవర్లకు సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సిహెచ్ రఘునందన్ రావు, డియస్పీలు, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



## మార్చి 1 నుంచి నెలరోజులు సెక్షన్ 30, 30(ఎ) పోలీసు చట్టం అమలు - ముందస్తు అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు నిషేధం ఎస్పీ పరితోష్ పంకజ్

సందేశం టైమ్స్ సంగారెడ్డి, మార్చి1( టీ సంగమేశ్వర్ ప్రతినిధి) సంగారెడ్డి జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మార్చి 1 నుంచి 31 వరకు నెల రోజుల పాటు పోలీసు చట్టం–1861లోని సెక్షన్ 30, 30(ఎ) అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే లేదా ప్రజాధనానికి నష్టం కలిగించే చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించిన ఎస్పీ, నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు.



## జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకల్లో సైన్స్ ఉపాధ్యాయులకు ఘన సత్కారం జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ ప్రశంసలు

సందేశం టైమ్స్ నారాయణఖేడ్, మార్చి 1( టి సంగమేశ్వర్ ప్రతినిధి) సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని మానూర్ మండలం బోరంచ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్ స్వామి సమక్షంలో జరిగిన ఈ వేడుకలో నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ సైన్స్ ఉపాధ్యాయులు టి. నర్సింహులు, జగదీష్ కుమార్‌లను శాలువాలతో సన్మానించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడంలో, సైన్స్ పట్ల ఆసక్తి కలిగించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. శాస్త్రం సమాజ అభివృద్ధికి పునాది అని, శాస్త్రీయ ఆలోచన ప్రతి ఒక్కరిలో అవసరమని ఈ సందర్భంగా వివరించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్ర అవగాహన పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దర్గా వద్ద నుంచి యువతిని అపహరించి హత్యాయత్నం - వీడియో కాల్‌లో బెదిరింపులు, ముగ్గురు రిమాండ్‌కు



వట్పల్లి మార్చి 1(సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ సంగమేశ్వర్) సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం లో తేదీ 28.02.2026 ఉదయం సుమారు 10:00 గంటల సమయంలో ధరఖాస్తుపల్లి గ్రామానికి చెందిన దౌల్తాబాద్ రూప తన తండ్రి లక్ష్మయ్య, తమ్ముడు నరేశ్‌తో కలిసి TS 15 FB 6387 నంబర్ గల మోటార్ సైకిల్‌పై తమ వ్యవసాయ భూమి సమీపంలోని దర్గా వద్ద పూజలు నిర్వహించి తిరిగి ఇంటికి వస్తుండగా, అదే గ్రామానికి చెందిన ఇటిక్యాపల్లి శ్రీకాంత్ (తండ్రి రాధన్న), ఇటిక్యాపల్లి జగదీశ్వర్, మామిడిపల్లి లక్ష్మణ్ (తండ్రి బాషయ్య)లు పథకం ప్రకారం TS 15 UF 1556 నంబర్ గల కారులో వచ్చి ఆమె మోటార్ సైకిల్‌ను అడ్డగించి బలవంతంగా కారులో ఎక్కించుకొని అపహరించడానికి యత్నించారు. ఈ సమయంలో శ్రీకాంత్ ఆమె నోటిలో గుడ్డ కుక్కి ఊపిరి ఆడనీయకుండా చేసి, జుట్టు పట్టుకొని ఈడ్చుకుంటూ వెళ్లగా, తన ఫోన్ ద్వారా బాధితురాలికి కాబోయే భర్త గోరకంటి వెంకటేశ్ (తండ్రి సంగయ్య)కు వీడియో కాల్ చేసి బెదిరింపులకు దిగినట్లు సమాచారం. అనంతరం బాధితురాలి జుట్టును మెడకు చుట్టి హత్యాయత్నం చేసి, దాడి చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు వట్‌పల్లి పోలీసులకు విషయం తెలియజేయగా, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పడి బాధితురాలిని రక్షించి, ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు."

## అరైవ్ అలైవ్-2026"లో భాగంగా డ్రైవర్లకు కంటి పరీక్షలు - 140 మందికి కళ్లద్దాల పంపిణీ




సందేశం టైమ్స్ సంగారెడ్డి, మార్చి 1( టీ సంగమేశ్వర్ ప్రతినిధి ) సంగారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు కచ్చితమైన కంటి చూపు కీలకమని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపిఎస్ పేర్కొన్నారు. "అరైవ్ అలైవ్–2026" రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బస్సులు, లారీలు, ఆటోలు నడిపే డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి, చూపు లోపాలు ఉన్న 140 మందికి ఎస్పీ చేతుల మీదుగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సురక్షిత డ్రైవింగ్‌కు స్పష్టమైన చూపు అవసరమని, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించుకోవాలని సూచించారు. డిఫెన్సివ్ డ్రైవింగ్‌పై అవగాహన కలిగి, నియంత్రిత వేగంతో వాహనాలు నడపాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ సత్తయ్య గౌడ్, ఇన్స్పెక్టర్లు రామకృష్ణ రెడ్డి, రాము నాయుడు, సుమన్ కుమార్, ఎస్ఐలు రాజేష్ నాయక్, సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.




## జాతీయ విజ్ఞాన దినోత్సవం ఘనంగా నిర్వహించిన ప్రాథమిక పాఠశాల వట్‌పల్లి తాండ

సందేశం టైమ్స్ వట్‌పల్లి తాండ మార్చి1( టి సంగమేశ్వర్ ప్రతినిధి) ప్రాథమిక పాఠశాల వట్‌పల్లి తాండలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత తొలి నోబెల్ బహుమతి గ్రహీత సి . వి . రమణ ఆవిష్కరించిన 'రామన్ ఎఫెక్ట్' ప్రాధాన్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ప్రపంచంలోని వింతలు, విశేషాలను గమనించడం ద్వారా విద్యార్థుల్లో పరిశీలనా శక్తి పెంపొందుతుందని, అవే భవిష్యత్తుకు పునాది వేస్తాయని పేర్కొన్నారు. పాత రాతియుగం నుంచి ఆధునిక యుగం వరకు విజ్ఞానం ఎన్నో మార్పులకు దారితీసిందని, నిప్పు, చక్రం, ఆవిరి యంత్రం, అచ్చు యంత్రం వంటి ఆవిష్కరణలు ప్రపంచ ప్రగతికి నాంది పలికారని వివరించారు. "ఎందుకు? ఏమిటి? ఎలా?" అనే సూత్రాల ఆధారంగానే శాస్త్రం అభివృద్ధి చెందిందని, ప్రతి అంశాన్ని లోతుగా అర్థం చేసుకునే అలవాటు పెంపొందించుకోవాలని ఉపాధ్యాయులు నర్సింలు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ వి. వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

# స్విమ్మింగ్ పూల్ కోచ్ దరఖాస్తుల ఆహ్వానం



సంగారెడ్డి,మార్చి 1 ( సందేశం టైమ్స్ సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి కె. సంగమేశ్వర్) జిల్లాలో స్విమ్మింగ్ పూల్ లో కోచ్ కొరకు అర్హులైన క్రీడాకారుల నుండి దరఖాస్తులను ఆహ్వానించుటజిల్లా యువజన మరియు క్రీడా కార్యాలయం, సంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో రాజీవ్ పార్క్ పక్కన, ఉన్న స్విమ్మింగ్ పూల్ నందు స్విమ్మింగ్ కోచ్ నియామక కొరకు అర్హత కలిగిన NIS 1st year సర్టిఫికెట్ లేదా సర్టిఫికెట్ కోర్సు చేసి 40 సంవత్సరాలలోపు ఉన్న క్రీడాకారులు స్విమ్మింగ్ కోచ్ కొరకు దరఖాస్తులను కోరనైనది. అర్హత కలిగిన కోచ్ సంబంధిత సర్టిఫికెట్లను జతపరిచి దరఖాస్తు ఫారంను తేదీ: 07-03-2026 లోపు జిల్లా యువజన మరియు క్రీడా కార్యాలయము, న్యూ కలెక్టరేట్ సంగారెడ్డి నందు స్వయంగా ఇవ్వగలరు. మిగతా వివరాలకు 7981798957 ను సంప్రదించగలరు.

తెలంగాణ ప్రభుత్వము

జిల్లా యువజన మరియు క్రీడల అధికారి కార్యాలయము : సూర్యాపేట
సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయము, సూర్యాపేట.

శ్రీ. తేజస్ నంద్ లాల్ పవార్, IAS
జిల్లా కలెక్టర్ & మేజిస్టేట్,
సూర్యాపేట.

శ్రీయుత జిల్లా విద్యా శాఖ అధికారి,
సూర్యాపేట గారికి.

లేఖ సంఖ్య. ఎ/డి.వై.ఎస్.ఓ/21/టి.జి.ఎస్.సి/2026-27, తేది: 29-02-2026

ఆర్యా !

విషయము:- డి.వై.ఎస్.ఓ – సూర్యాపేట – తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ నందు 4 వ తరగతిలో ప్రవేశాల కొరకు మండల స్థాయిలో క్రీడాకారుల ఎంపిక చేయుటకు MEO లకు ఆదేశాల ఇచ్చుట – గురించి.

నిర్దేశము:- 1). శ్రీయుత వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ SATG, హైదరాబాద్ వారు మరియు డైరెక్టర్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్, హకీంపేట వారి లేఖ సంఖ్య: TGSS/097/2026-27, తేది: -02-2026.

& & &

పై విషయమును అనుసరించి 2026-27 సంవత్సరంనకు గాను తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ నందు 4 వ తరగతిలో ప్రవేశాల కొరకు website: tgss.telangana.gov.in ద్వారా online లో రిజిస్ట్రేషన్ చేసుకున్న బాలబాలికలకు మూడు శ్రేణులు అనగా మండల స్థాయి, జిల్లా స్థాయి మరియు రాష్ట్ర స్థాయిలో 9 మోటార్ క్వాలిటి టెస్ట్ లను నిర్వహించి అత్యధిక సామర్థ్యం కలిగిన బాలబాలికలను తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ నందు 4 వ తరగతిలో ప్రవేశాల కొరకు ఎంపిక చేయడం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ నందు 4 వ తరగతిలో ప్రవేశాల కొరకు ప్రతి జిల్లా నుంచి 10 మంది బాలురు 10 మంది బాలికలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి ఎంపికకు పంపవలసినదిగా శ్రీయుత వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ SATG, హైదరాబాద్ వారు మరియు డైరెక్టర్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్, హకీంపేట వారు పై నిర్దేశము ద్వారా ఆదేశాలు జారి చేశారు.

ఆన్లైన్ రిజిస్ట్రేషన్, మండల స్థాయి, జిల్లా స్థాయి మరియు రాష్ట్ర స్థాయిలో 9 మోటార్ క్వాలిటి టెస్ట్ లను నిర్వహించే తేదీలను ఈ క్రింద చూపడమైనది.

| S. No. | Particulars | Dates |
|---|---|---|
| 1 | Online Registration | 26th Feb 2026 to 04th Mar 2026 |
| 2 | Mandal Level Selections | 13th Mar 2026 to 17th Mar 2026 |
| 3 | District Level Selections | 28th Mar 2026 to 01st Apr 2026 |
| 4 | State Level Selections | 27th Apr 2026 to 01st May 2026 |

మండల స్థాయిలో MEO ల గారి ఆధ్వర్యములో తేది: 13-03-2026 నుండి తేది: 17-03-2026 లోపు ప్రతి మండలములో ఈ క్రింద చూపిన 9 మోటార్ క్వాలిటి టెస్ట్ లతో పాటు మెడికల్ టెస్ట్ నిర్వహించి ఇందులో అధిక పాయింట్స్ సాధించిన 10 మంది బాలురు 10 మంది బాలికలను ఎంపిక చేసి జిల్లా స్థాయిలో జరిగే ఎంపికకు పంపవలసి ఉంటుంది.

1). Hight
2). Weight
3). 30 Mtr Flying Start
4). Standing Board Jump
5). 800 Mtr Run
6). 6x10 Mtr Shuttle Run
7). Medicine Ball Put
8). Vertical Jump
9). Flexibility Test

# తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు ఎంపిక పరీక్షలు – MEOలకు ఆదేశాలు

సూర్యాపేట సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 1: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ 4వ తరగతి ప్రవేశాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న విద్యార్థులకు మండల స్థాయిలో ఎంపిక పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ & మెజిస్ట్రేట్ ఆదేశించారు. ఎంపిక పరీక్షలను మండల స్థాయిలో MEO ఆధ్వర్యంలో నిర్వహించి, ప్రతి మండలం నుండి రాష్ట్ర స్థాయి క్వాలిఫైడ్ విద్యార్థులను ఎంపిక చేయాలని సూచించారు. ఈ పరీక్షలు శారీరక దారుఢ్య పరీక్షల ఆధారంగా నిర్వహించబడతాయని, 30 మీటర్ల పరుగుపందెం, నిలువు దూకుడు, మెడిసిన్ బాల్ త్రో, 800 మీటర్ల పరుగుపందెం, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ తదితర పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ నమోదు ఫిబ్రవరి 26 నుండి మార్చి 4 వరకు జరుగుతుండగా, మండల స్థాయి ఎంపికలు మార్చి 13 నుండి 17 వరకు, జిల్లా స్థాయి ఎంపికలు మార్చి 28 నుండి ఏప్రిల్ 1 వరకు, రాష్ట్ర స్థాయి ఎంపికలు ఏప్రిల్ 27 నుండి మే 1 వరకు జరుగనున్నట్లు అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి మండలం నుండి అర్హత సాధించిన విద్యార్థులను జిల్లా స్థాయికి పంపించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# భూదాన్ భూముల కూల్చివేతపై సీఎం క్షమాపణ చెప్పాలి – ఈటల రాజేందర్



సందేశం టైమ్స్, ఖమ్మం, మార్చి 1: ఖమ్మం జిల్లా వెలుగుమట్ల ప్రాంతంలో భూదాన్ భూములపై నివసిస్తున్న నిరుపేదల ఇళ్ల కూల్చివేత ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలని భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకుడు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవనంలో ఆశ్రయం పొందుతున్న బాధితులను పరామర్శించిన ఆయన వారికి భరోసా కల్పిస్తూ మాట్లాడారు. వినోబా భావే దానం చేసిన భూదాన్ భూమిలో పేదలు నివసిస్తుంటే అమానుషంగా కూల్చివేయడం దుర్మార్గమని, 62 ఎకరాల భూమిలో 32 ఎకరాల్లో పేదలు ఉండగా మిగిలిన భూమి ఎవరి చేతుల్లో ఉందో ప్రభుత్వం వెల్లడించాలని ప్రశ్నించారు. వేలాది పోలీసులతో వెళ్లి గుడిసెలను నేలమట్టం చేయడం నియంతృత్వ పాలనకు నిదర్శనమని, కూల్చివేతలకే పరిమితమైన ప్రభుత్వంగా మారిందని విమర్శించారు. ఇళ్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి అదే స్థలంలో ఇళ్లు కట్టించి ఇవ్వాలని, అప్పటివరకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధితులకు భారతీయ జనతా పార్టీ అండగా నిలుస్తుందని, వారి తరఫున న్యాయపోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, దేవకి వాసుదేవరావు, గల్లా సత్యనారాయణ, శీలం పాపారావు, దొంగల సత్యనారాయణ, మండడపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



# నారాయణఖేడ్‌లో తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ విజ్ఞాన దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది

సందేశం టైమ్స్ సంగారెడ్డి, ఫిబ్రవరి మార్చి1( టి సంగమేశ్వర్ ప్రతినిధి) సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ & జూనియర్ కాలేజీ (బాయ్స్–1)లో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ రాములు నేతృత్వంలో ఘనంగా జరిపారు. విద్యార్థులు రూపొందించిన వినూత్న శాస్త్రీయ నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పర్యావరణ పరిరక్షణ, సాంకేతిక అభివృద్ధి, శక్తి సంరక్షణలపై రూపొందించిన ప్రాజెక్టులు అందరి దృష్టినే ఆకర్షించాయి. ఉత్తమ నమూనాలు రూపొందించిన విద్యార్థులకు బహుమతులు ఇవ్వగా, విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయులు రమేష్ రెడ్డి, ఆస్రా సుల్తానాలను శాలువాలు, మెమెంటోలతో సన్మానించారు. ప్రిన్సిపాల్ రాములు మాట్లాడుతూ శాస్త్రవేత్త సి.వి. రామన్ స్ఫూర్తితో విద్యార్థులు దేశానికి కీర్తి తీసుకురావాలని, విజ్ఞానం సమాజ అభివృద్ధికి ప్రధాన ఆధారమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ సంజీవ్ నాయక్, స్కూల్ కోఆర్డినేటర్ మొహమ్మద్ జాకిర్, పి.ఈ.టి. అజీజ్, పీడీ సంతోష్, ఉపాధ్యాయులు నవనీత, బుజమ్మ, సుధీర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.





# ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికకు శ్రీకారం.. 99 రోజుల ప్రత్యేక కార్యాచరణకు సీఎం ఆదేశాలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 1: రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక' పేరుతో 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. మార్చి 6 నుండి జూన్ 12 వరకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం అమలు చేయాలని సూచించారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని నాలుగు కోట్ల ప్రజల పండుగలా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రతి శాఖ పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, పారిశుద్ధ్య కార్యక్రమాలు, ప్రజా సేవల వేగవంతం, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అన్ని సేవలను ఆన్‌లైన్ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, సాంకేతిక సంస్కరణల కోసం సీనియర్ ఐఏఎస్ జయేష్ రంజన్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహాలక్ష్మి, రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్తు, రూ.500 గ్యాస్, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు అర్హులందరికీ చేరేలా చూడాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను మెరుగుపరచాలని, ప్రతి శాఖ మిషన్ మోడ్‌లో పనిచేయాలని హెచ్చరించారు. కేంద్ర పథకాల నిధులు పూర్తిగా వినియోగించుకోవాలని, పెట్టుబడులు గ్రౌండ్ స్థాయికి రావడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు నరేందర్ రెడ్డి, సీఎంవో అధికారులు, అన్ని శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు. 99 రోజుల కార్యక్రమాన్ని వ్యక్తిగతంగా సమీక్షిస్తానని, పనితీరులో నిర్లక్ష్యం సహించబోమని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

# ఫేమస్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ పరీక్ష విజయవంతం



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 1: హైదరాబాద్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని జల్వాయు టవర్స్‌లో ఫేమస్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో తైక్వాండో విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షను ఘనంగా నిర్వహించారు. ఈ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షను తైక్వాండో థర్డ్ డాన్, నేషనల్ రిఫరీ, ఫేమస్ తైక్వాండో అకాడమీ ఫౌండర్ శెట్టి వెంకటేష్ స్వయంగా కోచ్ మరియు చీఫ్ ఎగ్జామినర్‌గా నిర్వహించారు. ఈ పరీక్షలో అదినవ్ రెడ్ వన్ బెల్ట్, ఇషిత, సుజిత్, అభిరామ్ రెడ్ బెల్ట్ పరీక్షల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ విద్య శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, స్వీయరక్షణ నైపుణ్యాలను పెంపొందిస్తుందని శెట్టి వెంకటేష్ తెలిపారు. చిన్నారులు క్రీడలతో పాటు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం ద్వారా ఆరోగ్యంగా, ధైర్యంగా ఎదుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ నిర్వాహకులను అభినందించారు

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ–మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.